# రహస్యభారతంలో
# నా ఆధ్యాత్మిక అన్వేషణ

పాల్ బ్రంటన్

తెలుగు సేత
జొన్నలగడ్డ పతంజలి

ఎమెస్కో

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | పాఠకులకి మనవి | 1 |
| 2. | అన్వేషణకి పూర్వరంగం | 10 |
| 3. | ఈజిప్టు ఇంద్రజాలికుడు | 23 |
| 4. | "ముక్తి ప్రదాత"తో మొదటిసారి | 34 |
| 5. | అడయారు యోగి– భ్రమ | 56 |
| 6. | మరణమూ–యోగమూ | 74 |
| 7. | మౌన యోగి | 93 |
| 8. | దక్షిణ భారత దేశ ఆధ్యాత్మిక గురువు | 105 |
| 9. | దివ్యజ్యోతికి నిలయం–అరుణాచలపర్వతం | 125 |
| 10. | మహనీయులూ–మంత్రగాళ్లూ | 158 |
| 11. | కాశీ నగరంలో అద్భుత వ్యక్తి | 182 |
| 12. | జీవితమూ–జ్యోతిషమూ | 197 |
| 13. | భగవంతుని ఉద్యానం | 219 |
| 14. | "ముక్తి ప్రదాత" మందిరంలో మరోసారి | 248 |
| 15. | ఒక వింత అనుభవం | 259 |
| 16. | "అరుణాచల" పర్వతం మీద నా కుటీరం | 273 |
| 17. | మనం మరిచిన శాశ్వత సత్యాలు | 292 |

అధ్యాయం 1

# పాఠకులకు మనవి

**సం**చలనాలకు నిలయమైన అద్భుత గ్రంథం లాంటిది భారతీయ జీవనం. ఆ జీవన గ్రంథంలోని కొన్ని నిగూఢమైన అధ్యాయాలని పాశ్చాత్య పాఠకులకి విడమరచి చెప్పటానికే నా ఈ ప్రయత్నం. ప్రాచీన కాలంలో భారత దేశాన్ని దర్శించి వచ్చిన సాహస యాత్రికులు అక్కడి ఫకీర్ల గురించీ, మంత్రగాళ్ల గురించీ ఒళ్లు జలదరించే కథలు చెప్పేవారు. ఈ ఆధునిక కాలంలో కూడా భారతదేశం నుంచి వచ్చేవారు అటువంటి కథలూ, వార్తలూ అప్పుడప్పుడూ మోసుకొస్తున్నారు.

అయితే ఇటువంటి విచిత్ర కథనాలకు కారకులై, కొంతమంది "యోగులు" అనీ, మరికొంతమంది "ఫకీర్లు" అనీ వ్యవహరించే అసాధారణ వ్యక్తుల అసలు రహస్యమేమిటి? ప్రాచీన భారతీయ విజ్ఞానంలో పరమాద్భుతమైన మానసిక శక్తుల సాధన గురించి వినవస్తున్న వార్తలలో సత్యముందా?

ఈ ప్రశ్నలకు సమాధానం అన్వేషించే లక్ష్యంతో సాగిన నా సుదీర్ఘ భారతదేశ యాత్రానుభవాల సంక్షిప్త కథనం ఈ రూపంలో మీ ముందు ఉంచుతున్నాను. సంక్షిప్త కథనమని ఎందుకంటున్నానంటే, అక్కడ నేను ఎందరో వ్యక్తులను కలిసినా, స్థల, కాల పరిమితుల వల్ల వారిలో నాకు ఆసక్తి కలిగించినవారినీ, పాశ్చాత్య ప్రపంచానికి ఆసక్తి కలిగించగలరని నేను భావించిన వారినీ, కొద్దిమందిని ఎన్నుకొని వారిగురించి మాత్రమే ఇక్కడ రాయదలిచాను.

అంతేకాక, నా అన్వేషణలో జ్ఞానంతో పండిపోయినవారూ, అద్భుత శక్తులు గలవారూ, పావన చరితులూ అని నేను విన్న కొందరు వ్యక్తుల కోసం ఎండనకా, వాననకా, పగలూ, రాత్రీ, ఎన్నో ప్రయాసలకోర్చి ప్రయాణించి వారిని కలిశాను. కానీ అటువంటివారిలో ఎక్కువమంది, ఏదో విధంగా ప్రజల మన్నన పొందుతున్న అజ్ఞానులూ,

అధ్యాయం 2

# అన్వేషణకి పూర్వరంగం

పాఠశాలలో భూగోళ శాస్త్రం పాఠం చెపుతున్న ఉపాధ్యాయుడు గోడకి వేలాడదీసిన పాతకాలపు మ్యాపులో భూమధ్యరేఖకి కిందుగా ఉన్న ఓ త్రిభుజాకార భూభాగాన్ని చూపిస్తూ తరగతిలో పిల్లల వంక చూశాడు. "ఎందుకొచ్చిన పాఠం రా బాబూ ఇది" అంటున్న వాళ్ల ముఖకవళికలు చూసి వారిలో ఆసక్తి పెంచటం కోసం, గొంతు పెంచి "బ్రిటను దేశపు రాజకిరీటంలోని వజ్రాలన్నిటిలోకీ తలమానికమైనదీ భారత దేశం" అంటూ మొదలెట్టాడు.

భారత దేశమనే పేరు చెవినబడగానే, అప్పటివరకూ పగటికలలలో ఎక్కడెక్కడో విహరిస్తున్న ఓ యువ హృదయం తరగతి గదిలోకి వచ్చి పడింది. భారతదేశమనే పేరు వినపడినా లేక ఎక్కడైనా అచ్చులో భారత దేశమనే పేరు కనపడినా, ఆ బాలుడి హృదయం అవ్యక్తానందానికి లోనవుతుంది. తరగతి గదిలో ఉపాధ్యాయుడు, ఈ బాలుడు తానిచ్చిన లెక్కకి సమాధానం కోసం తల వంచి దీర్ఘంగా కృషి చేస్తున్నాడనుకుంటాడు. ఈ ఆకతాయి కుర్రాడేమో లెక్కల కాగితం కింద ఓ తెల్లకాగితం మీద తలపాగాలతో గోధుమ వర్ణంలో ఉన్న మనుష్యులనీ, సుగంధ ద్రవ్యాలెత్తుకుంటున్న ఓడలనీ చిత్రిస్తూ కూర్చుంటాడు. క్రమేపీ ఆ బాలుడు యువకుడుగా పరిణతి చెందినప్పటికీ హిందూస్థాన్ అనబడే భారత దేశం గురించి అతని ఆసక్తి సన్నగిల్లలేదు సరికదా, ఆ ఆసక్తి ఆసియా ఖండం మొత్తానికీ వ్యాపించింది.

ప్రాచ్యదేశాలకి వెళ్లి, చూడాలనే కోరికలూ, ఆశయాలతో, ఇంట్లో చెప్పకుండా వెళ్లి ఏదో ఒక ఓడలో ఎక్కి పారిపోదామనే ప్రణాళికలు కూడా వేశాడాబాలుడు. అవేమీ ఫలించలేదు. అందుకని తన సహాధ్యాయులని కూర్చోపెట్టి ఈ విషయం మీద అద్భుత గాథలు వర్ణించి చెప్పేవాడు. అటువంటి సహాధ్యాయులలో నుంచి మరో విద్యార్థి కూడా

అధ్యాయం 3

# ఈజిప్టు ఇంద్రజాలికుడు

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గురించి చెప్పుకోవాలి. నా అన్వేషణ మొదలెట్టకముందే అదృష్టం నన్ను వెతుక్కొంటూ వచ్చింది. అప్పటికి నేనింకా బొంబాయిలోని దర్శనీయ స్థలాలు పూర్తిగా చూడనే లేదు. బొంబాయి గురించి అప్పటివరకూ నాకు తెలిసింది అంతా రాస్తే ఒక పోస్టు కార్డు గూడా నిండదు. నా ట్రంకు పెట్టెల్ని ఇంకా తెరవలేదు కూడా. నా ప్రస్తుత వ్యాపకం ఏమిటంటే ఓడలోని నా తోటి ప్రయాణికులు బొంబాయి అంతటిలోకీ అత్యంత సదుపాయమైనదిగా వర్ణించిన "మెజెస్టిక్ హోటల్"లో తీరికగా కూర్చుని నా పరిసరాల్నీ, వ్యక్తులనీ పరిశీలించటమే.

నా ఈ వ్యాపకంలోనే, అద్భుతాలు సృష్టించగల ఒక మాయాజాల నిపుణుడు గూడ నాతోపాటు అదే హోటల్లో అతిథిగా ఉన్న విషయం నా దృష్టికి వచ్చింది.

ఆయన, హస్త లాఘవంతో థియేటర్లలో ప్రేక్షకులని అద్భుతాల అంచులకి తీసుకెళ్లి వారిని మెప్పించి, కాసులు వెనకేసుకునే సాధారణ మెజీషియన్ కాదు. మధ్యయుగాలకి చెందిన మంత్రగాళ్ల పరంపరలోకి వస్తాడని చెప్పవచ్చు. సామాన్య మానవుల కళ్లకు కనిపించని అలౌకిక శక్తులతో నిత్యమూ ఆయన సంభాషిస్తూ ఉంటాడట. అది నిజమైనా కాకపోయినా తన గురించి ఈ విధమైన అభిప్రాయం అందరికీ కలిగేటట్లు చేయడంలో ఆయన సఫలుడయ్యాడనే చెప్పాలి. ఆయనతో వ్యవహారాలన్నిటిలో హోటల్ ఉద్యోగులు బెదురు చూపులు చూస్తూ ఊపిరి బిగబట్టి పని చేయడమూ, ఆయన పక్కనుంచి వెళు తుంటే హోటల్లోని మిగతా అతిథులు మాట్లాడడం ఆపేసి ఆసక్తితో ఆయన వెళ్లే వంక చూస్తూ ఉండిపోవడమూ దీనికి సాక్ష్యాలు. ఆయన మాత్రం ఇదేమీ పట్టించుకోడు. అంతే కాదు, డైనింగ్ రూంలో కూడా ఆయన ఎప్పుడూ ఒంటరిగా ఉండడానికే ప్రయత్నించేవాడు.

అధ్యాయం 4

# "ముక్తిప్రదాత"తో మొదటిసారి

"మిమ్మల్ని కలవటం చాలా సంతోషంగా ఉంది!" అనే సాదరమైన మాటలతో మెహెర్ బాబా నన్ను పలకరించారు. పాశ్చాత్య వినీలాకాశంలోకి ఒక తోకచుక్కలాగా ప్రవేశించి అమెరికా, యూరపులలో మిలియన్ల కొద్దీ ప్రజలలో ఉత్సుకతని రేకెత్తించిన వ్యక్తి మెహెర్ బాబా. అంతేకాదు, ఒక తోకచుక్కలాగా అంతే వేగంగా భూమికి పడిపోయిన ఖ్యాతి కూడా ఆయనకే దక్కింది. మెహెర్ బాబాని ఇంటర్వ్యూ చేసిన పాశ్చాత్య పత్రికా విలేఖరులలో నేనే మొదటివాడిని. ఆయన కీర్తి ఇంకా భారతదేశమంతా పూర్తిగా వ్యాపించకముందే ఆయన ఆశ్రమాన్ని వెతుక్కుంటూ వెళ్లటం వల్ల ఇది సాధ్యపడింది.

మెహెర్ బాబా గారి ముఖ్య శిష్యులొకరితో నాకు పరిచయం ఏర్పడింది. కొంత కాలం ఉత్తర ప్రత్యుత్తరాలు సాగాక, మానవజాతిని ఉద్ధరించటానికి అవతరించినట్లు చెప్పుకునేవారి జాబితాలో చేరిన ఆయన గురువుగారిని చూద్దామనిపించింది. నాకు తోడుగా ఉండి తీసుకెళ్లటానికి మెహెర్ బాబా పార్శీ శిష్యులిద్దరు బొంబాయికి వచ్చారు. తమ గురువు గారికి చక్కని పూలూ, ఫలాలూ, సమర్పించుకోవాల్సి ఉంటుందని వారు చెప్పటంతో బజారుకి వెళ్లాము. అక్కడ మంచి పూలూ, పళ్లూ వాళ్లు నా తరఫున ఏరి తీసుకున్నారు.

రాత్రంతా ప్రయాణం చేసి మా రైలు మర్నాడు ఉదయానికి అహమద్ నగర్ చేరింది. మొగల్ సమ్రాట్టులలో రత్నంలా ప్రకాశించి, క్రూరుడుగా పేరు తెచ్చుకున్న ఔరంగజేబు చక్రవర్తి, ఈ అహమద్ నగర్ లోని ఒక డేరాలో తన చివరి శ్వాస విడిచినట్లు చరిత్ర పాఠాలలో చదువుకున్న విషయం నాకు గుర్తుకు వచ్చింది. ఒక పాత కాలపు ఫోర్డు కారు మెహెర్ బాబా ఆశ్రమానికి మమ్మల్ని తీసుకెళ్లటానికి స్టేషనుకి వచ్చి ఉంది. ఏడు